నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
1 నవంబర్ 2023
పేజీలు 8

**ఇండియా-యూకే**

మొదటి ఇండియా-యూకే 2+2 విదేశీ, రక్షణ డైలాగ్‌ను న్యూఢిల్లీలో అక్టోబర్ 16న నిర్వహించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ యూరప్ వెస్ట్ జాయింట్ సెక్రటరీ పీయూష్ శ్రీవాస్తవ, రక్షణ మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ సహకార సంయుక్త కార్యదర్శి విశ్వేష్ నేగి, యూకే నుంచి ఇండియన్ ఓషన్ డైరెక్టరేట్ ఇండియా డైరెక్టర్ బెన్ మిల్లర్, రక్షణ మంత్రిత్వ శాఖ ఫైనాన్స్ అండ్ మిలిటరీ కెపాసిటీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాబ్ మగోవాన్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

# సఖారోవ్ ప్రైజ్‌ను ఈ ఏడాది ఎవరికి ప్రకటించారు?

1. **ఉత్తమ పర్యాటక గ్రామంగా 2023కు ఎంపికైన దోర్డో ఏ రాష్ట్రంలో ఉంది? (4)**
   1) తెలంగాణ 2) మేఘాలయ
   3) మధ్యప్రదేశ్ 4) గుజరాత్

**వివరణ:** గుజరాత్ రాష్ట్రానికి చెందిన దోర్డో ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికయ్యింది. స్పెయిన్‌లోని మాడ్రిడ్ కేంద్రంగా పనిచేసే ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ దీన్ని ఎంపిక చేసింది. మొత్తం 54 గ్రామాలు పోటీ పడగా అందులో దోర్డో ఎంపికయ్యింది. తొమ్మిది అంశాల ప్రాతిపదికన ఈ ఎంపికను చేపట్టారు. సహజ వనరులు, వాటి పరిరక్షణ, సాంస్కృతిక అంశాలు, పర్యావరణ సుస్థిరత, ఆర్థిక, సామాజిక కార్యకలాపాలు తదితర అంశాలను పరిశీలించారు. 2021లో ఈ అవార్డును తెలంగాణలోని భూదాన్ పోచంపల్లి గెలుచుకుంది. ఆ ఏడాది మేఘాలయ రాష్ట్రం నుంచి కోంగ్‌తాంగ్, మధ్యప్రదేశ్ నుంచి లద్‌పురా ఖాస్ గ్రామాలు పోటీ పడ్డాయి.

2. **పింఛను సూచీలో భారత్ ఎన్నో స్థానంలో ఉంది (2)**
   1) 42 2) 45 3) 47 4) 1

**వివరణ:** ప్రపంచ పింఛను సూచీలో భారత్ 45వ స్థానంలో నిలిచింది. 2022లో 41వ స్థానంలో ఉంది. ర్యాంక్ వెనక్కి వెళ్లినా స్కోర్ మాత్రం పెరిగింది. 2022లో భారత్ సాధించిన స్కోర్ 44.4 కాగా, 2023లో 45.9కి చేరింది. ఈ సూచీలో నెదర్లాండ్స్ అగ్రస్థానంలో ఉంది. మెర్సర్, సీఎఫ్‌ఏ ఇన్‌స్టిట్యూట్ ఈ సూచీని విడుదల చేస్తుంది. పదవీ విరమణ పద్ధతులు, ఆ తర్వాత పొందే లబ్ధి, ఆయా వ్యక్తుల పరిస్థితుల్లో మెరుగు చేసేందుకు అనుసరిస్తున్న విధానాలు తదితర అంశాల ఆధారంగా ఈ సూచీని రూపొందిస్తారు. 47వ స్థానంలో దక్షిణ అమెరికా ఖండంలోని అర్జెంటీనా ఉంది.

4. **డిజికవచ్‌ను ఎవరు ప్రారంభించారు? (1)**
   1) గూగుల్ సంస్థ 2) మైక్రోసాఫ్ట్
   3) మెటా 4) క్వాల్‌కం

**వివరణ:** ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు గూగుల్ సంస్థ డిజికవచ్‌ను అందుబాటులోకి తేనుంది. ఆన్‌లైన్ మోసాలు చేసేందుకు యత్నించే వారి వ్యూహాలను ముందే పసిగట్టి, దాన్ని నిరోధించడమే లక్ష్యంగా ఈ పద్ధతి ఉండనుంది. గూగుల్ సంస్థ అమెరికా కేంద్రంగా పనిచేస్తుంది. దీన్ని 1998 సెప్టెంబర్ 4న ఏర్పాటు చేశారు.

5. **అక్టోబర్ 24ను ఏ రోజుగా నిర్వహిస్తారు? (4)**
   1) ఐక్యరాజ్య సమితి ఏర్పాటు రోజు
   2) ప్రపంచ అభివృద్ధి సమాచార రోజు
   3) ప్రపంచ పోలియో రోజు 4) పైవన్నీ

**వివరణ:** 1945 అక్టోబర్ 24న ఐక్యరాజ్య సమితి ఏర్పాటైన నేపథ్యంలో ఆ రోజును ఐక్యరాజ్య సమితి రోజుగా నిర్వహిస్తారు. అలాగే ఇదే రోజున ప్రపంచ అభివృద్ధి సమాచార రోజుగా చేస్తారు. 1972లో ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ తీర్మానం ఆమోదించినందుకు ఈ రోజు నిర్వహిస్తారు. అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న సమస్యల గుర్తింపు, వాటి పరిష్కారం అలాగే అంతర్జాతీయ పరస్పర సహకారం కోసం ఈ రోజు ప్రత్యేకించింది. అలాగే ఏటా అక్టోబర్ 24న ప్రపంచ పోలియో రోజుగా కూడా నిర్వహిస్తారు. భారత్ పోలియో రహిత దేశంగా 2014న ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ వైరస్‌కు సంబంధించిన చివరి కేసు 2011 జనవరి 13న నమోదయ్యింది.

6. **రాఫెల్ మేరియానో గ్రోసి ఇటీవల భారత్‌ను సందర్శించారు. ఆయన ఏ సంస్థకు నేతృత్వం వహిస్తున్నారు? (3)**
   1) ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్
   2) ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్
   3) ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజన్సీ
   3) యూరోపియన్ యూనియన్

**వివరణ:** ఆస్ట్రియాలోని వియన్నా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ అణు శక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మేరియానో గ్రోసి ఇటీవల భారత్‌ను సందర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీతో అక్టోబర్ 23న సమావేశం అయ్యారు. శూన్య ఉద్గారాన్ని సాధించేందుకు ఏ విధంగా భారత్ అణుశక్తిని వినియోగించుకోవాలన్న అంశం మీద ఇరువురు చర్చించారు. అదే విధంగా ఆహారం, వైద్యం, నీటి శుద్ధి తదితర రంగాలకు అణుశక్తిని వినియోగించుకొనే విధానం, సాంకేతిక అంశాలను కూడా చర్చించారు.

7. **సంపన్నుల పైన 2% ప్రపంచ పన్ను విధించాలని ఇటీవల సూచించిన సంస్థ ఏది? (2)**
   1) ప్రపంచ బ్యాంక్
   2) యూరోపియన్ యూనియన్
   3) ప్రపంచ వాణిజ్య సంస్థ 4) ఇంటర్‌పోల్

**వివరణ:** ప్రపంచ పన్ను ఎగవేత నివేదిక-2024ను యూరోపియన్ యూనియన్ వెలువరించింది. ప్రపంచ సంపన్నులపై 2% పన్ను విధించాలని సూచించింది. కొంత మంది పన్ను పూర్తి స్థాయిలో ఎగవేయడమో లేదా స్వల్పంగా 0.5% మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొంది. ఈ తరహాలో పన్ను విధించడం వల్ల 250 బిలియన్ డాలర్ల సంపద సృష్టించవచ్చని పేర్కొంది. 1995 నుంచి పరిశీలిస్తే, సరాసరిన సంపద ఉన్న వారిపై 7% పన్ను ఉంటుంది. దీన్ని తగ్గించడం ద్వారా ఎగవేతను అడ్డుకోవచ్చని నివేదిక అభిప్రాయపడింది.



3. **మెహ్రౌలీ ఆర్కియాలజికల్ పార్క్ ఎక్కడ ఉంది? (3)**
   1) ముంబయి 2) ఆగ్రా 3) ఢిల్లీ 4) చండీఘర్

**వివరణ:** కేంద్ర పాలిత ప్రాంతం అయిన న్యూఢిల్లీలో మెహ్రౌలీ ఆర్కియాలాజికల్ పార్క్ ఉంది. ఇటీవల ప్రజలను ఇందులోకి అనుమతిస్తున్నారు. యునెస్కో వారసత్వ అంశాల జాబితాలో చోటు ఉన్న కుతుబ్‌మినార్‌కు అత్యంత సమీపంలోనే మెహ్రౌలీ ఆర్కియాలాజికల్ పార్క్ ఉంటుంది. దీని విస్తీర్ణం 200 ఎకరాలు. గుప్తుల వంశానికి చెందిన రెండో చంద్రగుప్తుడికి చెందిన మెహ్రౌలీ శాసనం కూడా ఇక్కడే ఉంది.

8. **ఏ దేశంతో కలిసి భారత్ హరిమౌ విన్యాసాలను నిర్వహిస్తుంది? (1)**
   1) మలేషియా 2) థాయిలాండ్
   3) ఇండోనేషియా 4) లావోస్

**వివరణ:** భారత్, మలేషియా మధ్య హరిమౌ విన్యాసం అక్టోబర్ 23న ప్రారంభమయ్యింది. నవంబర్ 5 వరకు కొనసాగుతుంది. మేఘాలయలోని ఉమ్రోయి కంటోన్మెంట్‌లో ఈ విన్యాసం నిర్వహిస్తున్నారు. భారత్ నుంచి రాజ్‌పుత్ రెజిమెంట్ ఇందులో పాల్గొంటుండగా, మలేషియా తరపున అయిదో రాయల్ బెటాలియన్ పాల్గొంటుంది. గతేడాది ఈ విన్యాసాలు మలేషియాలో నిర్వహించారు. ఇరు దేశాల సైన్యాల మధ్య పరస్పర సైనిక సహకారం, సమన్వయాన్ని పెంపొందించేందుకు ఈ విన్యాసాలు చేపడుతున్నారు.

9. **వన్డేల్లో అతి వేగంగా 2000 పరుగులు పూర్తి చేసిన క్రికెటర్ ఎవరు? (3)**
   1) హషీం ఆమ్లా 2) విరాట్ కోహ్లీ
   3) శుభ్‌మన్ గిల్ 4) ఇషాన్ కిషన్

**వివరణ:** వన్డే క్రికెట్ చరిత్రలో అతి తక్కువ మ్యాచ్‌ల్లో 2000 పరుగులు పూర్తి చేసిన రికార్డును శుభ్‌మన్‌గిల్ నెలకొల్పాడు. కేవలం 38 ఇన్నింగ్స్‌ల్లోనే అతడు ఈ మైలు రాయిని అందుకున్నాడు. అంతకుముందు ఈ రికార్డ్ దక్షిణాఫ్రికాకు చెందిన హషీం ఆమ్లా పేరిట ఉంది. ఆయన 2000 పరుగులు చేయడానికి 40 ఇన్నింగ్స్‌లు ఆడాడు.

10. **భారతదేశ తొలి ద్రవ నానో డీఏపీ ఫర్టిలైజర్ ప్లాంట్‌ను ఎక్కడ నెలకొల్పారు? (1)**
   1) గుజరాత్ 2) మిజోరం
   3) అసోం 4) హిమాచల్‌ప్రదేశ్

**వివరణ:** భారతదేశంలోనే తొలి నానో డీఏపీ ఫర్టిలైజర్‌ను గుజరాత్‌లో గాంధీనగర్ వద్ద కలోల్‌లో ఏర్పాటు చేశారు. ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో ఆపరేటివ్ దీన్ని ఏర్పాటు చేసింది. సహజ వ్యవసాయాన్ని పెంపొందించేందుకు సంబంధించింది ఇది. కృత్రిమ ఎరువులు, రసాయనాలు వినియోగించకుండా పంటలు పండించే విధానం దిశగా మళ్లిస్తుంది. నానో డీఏపీ వల్ల భూమిలోని పోషకాలపై ఎలాంటి ప్రభావం ఉండదు. ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.300 కోట్లు వెచ్చించారు.

11. **ఏ రోజున ప్రపంచ గణాంక దినోత్సవాన్ని జరుపుతారు? (2)**
   1) అక్టోబర్ 19 2) అక్టోబర్ 20
   3) అక్టోబర్ 21 4) అక్టోబర్ 22

**వివరణ:** ఏటా అక్టోబర్ 20న ప్రపంచ గణాంక దినోత్సవం (వరల్డ్ స్టాటిస్టిక్స్ డే)గా నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా గణాంకాల ప్రాధాన్యాన్ని తెలిపేందుకు ఉద్దేశించింది ఇది. 2015లో ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం మేరకు ఈ రోజును ఎంపిక చేశారు. ఇదే అక్టోబర్ 20న భారతదేశంలో జాతీయ స్మారక రోజుగా కూడా నిర్వహిస్తారు. భారత సార్వభౌమ అధికారాన్ని రక్షించేందుకు త్రివిధ దళాలు చేపడుతున్న కృషిని గుర్తు చేసుకొనేందుకు ఉద్దేశించింది ఇది. అలాగే అక్టోబర్ 21న జాతీయ పోలీస్ స్మారక దినోత్సవం కూడా నిర్వహిస్తారు. మన దేశంలో జాతీయ గణాంక దినోత్సవాన్ని జూన్ 29న జరుపుకొంటారు. పీసీ మహలనోబిస్ జయంతిన ఆయన స్మారకార్థం ఈ రోజును ఎంపిక చేశారు.

12. **సుస్థిర చర్యలకు యూఎన్‌సీటీఏడీ నుంచి అవార్డును పొందిన భారత సంస్థ ఏది? (3)**
   1) సీఐఐ 2) ఫిక్కీ
   3) ఐసీఏఐ 4) నాస్కాం

**వివరణ:** సుస్థిరాభివృద్ధికి సంబంధించిన చర్యలు తీసుకున్నందుకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అనే సంస్థ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ నుంచి అవార్డ్ పొందింది. ఈ సంస్థ జెనీవా కేంద్రంగా పనిచేస్తుంది. ఈ సంస్థ ఎనిమిదో ప్రపంచ పెట్టుబడుల సదస్సును ఇటీవల నిర్వహించింది. ఈ సందర్భంగా ఐసీఏఐకు అవార్డును ఇచ్చింది. సుస్థిరాభివృద్ధికి అవసరమైన చర్యలను ఆ సంస్థ తీసుకుందని ప్రశంసించింది. ఐసీఏఐను 1949, జూలై 1న ఏర్పాటు చేశారు.

14. **నన్హే ఫరిష్తే కార్యక్రమాన్ని చేపట్టింది ఎవరు? (2)**
   1) సీబీఐ 2) రైల్వే రక్షణ దళం
   3) భారత సైన్యం
   4) సెంట్రల్ విజిలెన్స్ కమిషన్

**వివరణ:** వివిధ కారణాలతో కుటుంబానికి దూరమైన వారిని మళ్లీ వాళ్ల దగ్గరకు చేర్చేందుకు భారత రైల్వే రక్షణ దళం చేపట్టిన ఆపరేషనే నన్హే ఫరిష్తే. ముందుగా తప్పిపోయిన చిన్నారులకు భద్రతతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించి, ఇంటి నుంచి దూరం కావడానికి కారణాలను తెలుసుకొని మళ్లీ తమ కుటుంబానికి అప్పగిస్తారు.

15. **హార్వర్డ్ న్యాయ విద్యాలయం నుంచి 'అవార్డ్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్'ను గెలుచుకున్న భారత న్యాయమూర్తి ఎవరు? (3)**
   1) ఎన్‌వీ రమణ 2) హరీష్ సాల్వే
   3) చంద్రచూడ్ 4) వినాయక్‌రావు

**వివరణ:** భారత్‌కు ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ చంద్రచూడ్ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును పొందారు. హార్వర్డ్ యూనివర్సిటీ ఇచ్చే 'అవార్డ్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్'ను ఆయన గెలుచుకున్నారు. ఆయన ఇదే విశ్వవిద్యాలయంలో 1982 నుంచి 1983 వరకు మాస్టర్స్ లా (ఎల్‌ఎల్‌ఎం)ను పూర్తి చేశారు. అలాగే 1983 నుంచి 1986 వరకు కూడా ఇక్కడే డాక్టర్ ఆఫ్ జ్యుడీషియల్ సైన్స్ (ఎస్‌జేడీ)ని పూర్తి చేశారు. ఈ ఏడాది హార్వర్డ్ న్యాయ విద్యాలయం ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తయ్యింది. భారతదేశంలో 50వ ప్రధాన న్యాయమూర్తి అయిన చంద్రచూడ్ తండ్రి జస్టిస్ వైవీ చంద్రచూడ్ కూడా గతంలో ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. భారత న్యాయ చరిత్రలో తండ్రీకొడుకులు ప్రధాన న్యాయమూర్తులుగా అయిన తొలి సందర్భం ఇదే.

13. **సఖారోవ్ ప్రైజ్‌ను ఈ ఏడాది ఎవరికి ప్రకటించారు? (1)**
   1) మహ్సా అమిని, ఇరాన్ మహిళలు
   2) మహ్సా అస్మిని, నర్గిస్ మహమ్మది
   3) నర్గిస్ మహమ్మది, ఎలాహే మహమ్మది, నిలోఫర్ హమేదీ
   4) పై ఎవరూ కాదు

**వివరణ:** యూరోపియన్ యూనియన్ ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన సఖారోవ్ అవార్డ్ ఈ ఏడాది ఇరాన్‌కు చెందిన మహ్సా అమినీతో పాటు ఆ దేశంలో మహిళలు నిర్వహించిన స్వేచ్ఛా ఉద్యమానికి దక్కింది. మానవ హక్కుల కోసం కృషి చేసే వారికి యూరోపియన్ యూనియన్ వాళ్లు ఇచ్చే అవార్డ్ ఇది. 1988లో ఈ అవార్డ్‌ను ప్రవేశపెట్టారు.



వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

